ప్రజాశక్తి

శుక్రవారం 30 డిసెంబర్ 2022 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఆమెపై అంతులేని దాడులు!

ఈనెల 5వ తేదీన ఉన్మాది చేతిలో హత్యకు గురైన తపశ్వి మృతదేహం వద్ద పోలీసులు (ఫైల్)

- మహిళలపై పెరిగిన నేరాలు
- మొత్తం నేరాల్లో 17 శాతం
- రోడ్డు ప్రమాదాల్లోనూ అధికం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో మహిళలపై దాడులకు సంబధించిన కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. 2021తో పోలిస్తే 2022లో ఈ నేరాలు పెరిగాయి. అర్బన్ ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ గురువారం విడుదల చేసిన వివరాల ప్రకారం. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు మొత్తం 9747 కేసులు నమోదు కాగా వీటిల్లో 1651 కేసులు మహిళలకు సంబంధించినవే. ఇటీవల పెదకాకాని మండలం తక్కెళ్లపాడు జరిగిన వైద్య విద్యార్థిని తపస్వీ హత్య కేసు జిల్లాలో కలకలం రేపింది. మహిళలపై నేరాలకు సంబంధించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగదని భావించిన వారు నేరుగా ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా స్పందన ద్వారా స్వీకరించిన ఫిర్యాదులు 675, డయల్ 100 లేక 112 ద్వారా వచ్చినవి 512, పోలీసు సేవా యాప్ ద్వారా 17, సైబర్ మిత్ర తో 43 ఫిర్యాదులు అందాయి. ఆస్తి వివాదాలకు సంబంధించిన నేరాలు 1407, రోడ్డు ప్రమాదాలు 1006, మోసాలు 962, ఇతర నేరాలు 3498 ఉన్నాయి.

హత్యలు గతంలో కంటే తగ్గాయి. 2020లో 46, 2021లో 54, 2022లో 36 జరిగాయి. మొత్తంగా ఆస్తికి సంబంధించిన నేరాలు 2020లో 751 జరగ్గా 2021లో 902, 2022లో 1407 నేరాలు నమోదయ్యాయి. 2020లో మొత్తం నేరాలు 11595 జరగ్గా 2021లో 11993, 2022లో 9747 జరిగాయి. 2020లో మొత్తం నేరాల్లో రూ.7.91 కోట్ల ఆస్తి చోరీ కాగా రూ.2.90 కోట్ల వరకు రికవరి చేశారు. 2021లో రూ.7.94 ఆస్తి చోరీకి గురికాగా రూ.3.37 కోట్ల మేరకు రికవరీ చేశామని ఎస్పీ తెలిపారు. ఈ ఏడాది 11.11 కోట్ల ఆస్తి చోరీకాగా 6.82 కోట్ల మేరకు రికవరి చేశారు. గంజాయికి సంబంధించి 2020లో 51 కేసుల్లో 169 మందిని అరెస్టు చేసి 728.50 కిలోలు సీజ్ చేయగా 2021లో 70 కేసులు నమోదు చేసి 182 మందిని అరెస్టు చేసి 3613.66 కిలోల గంజాయి సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది 68 కేసులు నమోదు అయ్యాయి. 154 మందిని అరెస్టు చేశారు. 260 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

పటిష్ట చర్యలతో తగ్గింపునకు కృషి

శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. పోలీసులు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ వల్ల గుంటూరులో గతేడాది ఆగస్టు 15న జరిగిన రమ్య హత్య కేసులో ఉరిశిక్ష పడిందన్నారు.. నేరాల్లో నిందితులకు శిక్షలు పడేందుకు వీలైనంత వరకు త్వరితగతిన ఛార్జీషీట్లు దాఖలు చేస్తున్నామని చెప్పారు. లోక్‌అదాలత్ ద్వారా ఈ ఏడాది 5097 కేసులల్లో రాజీ జరిగిందని తెలిపారు. 2021లో 3605, 2020లో 890 కేసులు లోక్ అదాలత్‌లో రాజీ జరిగింది. ప్రతి సంఘటనలోనూ తక్షణం స్పందిస్తున్నామని నిందితులను వెంటనే అరెస్టు చేస్తున్నామని తెలిపారు. ఐటి నేరాల్లో మొత్తం 17 కేసుల్లో రూ.28.10 లక్షల సొమ్ము కాజేయగా రూ.26.55 లక్షలు వెంటనే గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా ఈ ఏడాది నేరాల సంఖ్య తగ్గిందని, తీవ్రమైన నేరాలకు సంబంధించి 8 మందికి శిక్షలుపడగా ఈ ఏడాది 32 మందికి శిక్షలు పడ్డాయని ఎస్పీ వివరించారు. ఈ ఏడాది ఎదురైన పరిస్థితులు ఆధారంగా రానున్న ఏడాది మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తామని చెప్పారు.

విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న నేతాజి

రేపు జిల్లాకు కార్మిక చైతన్య జాతా

- గుంటూరు, మంగళగిరి తాడేపల్లిలో సభలు
- జయప్రదం చేయాలని సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లాలో శనివారం నిర్వహించే సిఐటియు కార్మిక చైతన్య రాష్ట్ర జాతాలో కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. ఈ మేరకు బ్రాడీపేటలోని సిఐటియు నగర కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. భీమవరంలో జనవరి 2, 3, 4 తేదీల్లో జరిగే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా మూడు కార్మిక చైతన్య రాష్ట్ర జాతాలు జరుగుతున్నాయన్నారు. ఈనెల 28వ తేదీన హిందూపురం నుండి ప్రారంభమైన కార్మిక చైతన్య రాష్ట్ర జాతా 31వ తేదీన సాయంత్రం 4 గంటలకు గుంటూరు నగరానికి చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా గుంటూరు మార్కెట్ సెంటర్లో, మంగళగిరి, తాడేపల్లిల్లో జరిగే సభలను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్స్ పేరుతో కార్మిక సంఘాలపై ఉక్కుపాదం మోపుతున్నాయన్నారు. కార్మికులకు రూ.26 వేలు కనీస వేతనం అమలు చేయాలని, బోనస్, పిఎఫ్, ఇఎస్ఐ. గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు కార్యకలాపాలు పునరుద్ధరించాలని, హమాలీ, ఆటో, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్మికుల సమగ్ర చట్టం అమలు చేయాలని, కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఆలోచనలు విరమించాలని, స్కీం వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలనే డిమాండ్స్‌తో పాటు నిత్యావసరాలు, పెట్రోలు, డీజిల్ ధరలను పేదలకు అందుబాటులో ఉండేలా కార్యాచరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ జాతా జరుగుతోందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, కార్యదర్శులు బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు పాల్గొన్నారు.

విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

వైద్య బృందంతో మంత్రి అంబటి రాంబాబు సమీక్ష

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

కరోనా 4వ దశ రానుందనే అంచనాల నేపథ్యంలో ఈ విపత్తును ఎదుర్కొనేందుకు వైద్య బృందం సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లిలోని ఏరియా ఆస్పత్రిలో వైద్య బృందంతో గురువారం ఆయన సమావేశమై కోవిడ్ విపత్తుపై సమీక్షించారు. కోవిడ్ కేసులు పెరిగితే అందుకు అవసరమైన బెడ్లు, ఆక్సిజన్ సిలిండర్లు, సిద్ధంగా ఉంచాలని చెప్పారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్నవాటిపై వివరాలడిగారు. 84 బెడ్లు, రెండు ఆక్సిజన్ కేంద్రాలు ఉన్నట్లు వైద్యులు వివరించారు. దాతల సహకారంతో మరో 54 ఆక్సిజన్ బెడ్లు ఉన్నట్లు తెలిపారు. విపత్తును ఎదుర్కొనేందుకు తాము సిద్ధమేనన్నారు. సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ, వైద్యాధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

యడవల్లి, మురికిపూడిలో అసైన్డ్ భూములు తీసుకోబోమని

మంత్రి రజిని ప్రకటించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

చిలకలూరిపేట నియోజకవర్గంలోని యడవల్లి, మురికిపూడి గ్రామాల్లో దళితుల అసైన్డ్ భూములను గ్రానైట్ మైనింగ్ కోసం తీసుకోబోమంటూ మంత్రి విడదల రజిని ప్రకటించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సత్తెనపల్లిలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత టిడిపి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న పత్తిపాటి పుల్లారావు యడవల్లిలో దళితుల భూములను కాజేయడం కోసం సొసైటీని రద్దు చేశారని తెలిపారు. అయితే అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి విడదల రజిని.. తాము అధికారంలోకి వస్తే యడవల్లి దళితుల భూములను తిరిగి ఇచ్చి పట్టాలిస్తానని, సాగునీటిని అందించే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు విద్యుత్‌ను పునరుద్ధరిస్తాం.. అని చిలకలూరిపేట కళామందిర్ సెంటర్లో ప్రకటించారని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత చట్ట ప్రకారం కాకుండా కేవలం మంత్రివర్గం కూర్చుని 270 జీవో జారీ చేశారని, ఎకరానికి రూ.8,33,333 పరిహారం మాత్రమే ఇచ్చి భూములను లాక్కున్నారని అన్నారు. భూములను ఇవ్వటం ఇష్టం లేని దళితులను... మీరు చెక్కులు తీసుకుపోతే భూములు పోతాయి, డబ్బులు పోతాయి.. అంటూ పోలీసులతో బెదిరించారని, ఇంటింకి తిరిగి చెక్కులిచ్చారని విమర్శించారు.

దళితుల భూముల్లో గ్రానైట్ ఉందని తెలిసిన రవి అనే వ్యక్తి దళితులకు వారి కుటుంబావసరాల కోసం అప్పులిచ్చి వాటికి ప్రతిగా భూములకు వచ్చిన నష్టపరిహారం డబ్బులను

2లో

లేమల్లె పాఠశాలలో ట్యాబ్‌లు పంపిణి

ప్రజాశక్తి-అమరావతి

మండల పరిధిలోని లేమల్లె గ్రామం లోని మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ నందు 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబులను గ్రామ సర్పంచ్ ఉగ్గం. పున్నమ్మ ఎలమందయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 21 మంది విద్యార్థిని విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బి.వెంకట్రావు, ఎంపిటిసిమీరావలి, నిబద్ధి సోషల్ మీడియా, వైస్ ప్రెసిడెంట్ చిలకా నాగులు,మేకల దేవ సహాయం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పురుషులు, స్త్రీలు ఇద్దరూ సమానమే

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టి. జె. పి. యస్. పి. జి.కళాశాల లో గురువారం మహిళా విభాగం ఆధ్వర్యంలో (జెండర్ సెన్సేజేషన్)పురుషులు, స్త్రీలు ఇద్దరూ సమానం అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగినట్లు పి. జి.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. యస్. అనితాదేవి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి విచ్చేసిన ప్రముఖ మనస్తత్వ నిపుణురాలు డాక్టర్. డి. సరోజ మాట్లాడుతూ పురుషులు, స్త్రీలు ఇద్దరూ సమానమేనని, ఈరోజులలో పురుషులతో సమానంగా స్త్రీ లు అన్ని రంగాలలో రాణిస్తున్నారని అన్నారు. అంతే కాకుండా పురుషులు ఉపాధి మార్గం లో కుటుంబాన్ని పోషిస్తుంటే, స్త్రీ ఆ కుటుంబాన్ని రక్షణ కవచంలా కాపాడుతోందని చెప్పారు. కార్యక్రమం లో విద్యార్థుల తో మమేకమై వారి భావాలను స్నేహితుల తో, అధ్యాపకుల తో ఏవిధంగా తెలియజేయాలనే విషయాలను గురించి తెలియజేశారు. విద్యార్థులు భయం లేకుండా సమాజంలో ఏ విధంగా ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్ళాలనే భావాలు వారిలో కలిగించారు.

చెక్క బండి పంపిణి

ప్రజాశక్తి-మంగళగిరి

పట్నంలోని మూడవ వార్డుకు చెందిన ఏ శివమ్మ అద్దె బండిలో వ్యాపారం చేసు కుం టుంది. చెక్క బండి కావాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కు వినతిపత్రం అందజేసింది. ఈ మేరకు గురు వారం శివమ్మకు టిడిపి నాయకులు చెక్క బండి అంద జేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయ కులు షేక్ రియాజ్, వై. అప్పారావు, పి శ్రీనివాస రావు, పి.ఏడుకొండలు పాల్గొన్నారు.

'వరికపూడిశెల'కు అటవీశాఖ అనుమతులు కోరలేదే?

ప్రజాశక్తి-మాచర్ల

ఎగువ పల్నాడుకు చెందిన వరికపూడిశెల నీటి పారుదల ప్రాజెక్ట్‌కు అటవీశాఖ అనుమతు లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌ను కోరక పోవడాన్ని బిజెపి ఖండిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి కోటేశ్వరరావు యాదవ్ తెలిపారు. గురు వారం ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌కు డిపిఆర్ తయారు చేసిందా అనే అనుమానం వ్యక్తం చేశారు.

ఇచ్చేది గోరంత.. లాగేది కొండంత

పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జివి ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్రంలో జగన్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చేది గోరంత లాగేది కొండంత అన్న చందంగా పదిమందికి పథకాలు ఇస్తూ పన్ను రూపంలో వేలాది మంది నుండి లాక్కుంటూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శావల్యాపురం మండలం వేల్పూరులో మండల టిడిపి అధ్యక్షులు గుంటూరు సాంబ శివ రావు అధ్యక్షతన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జీవి ఆంజనేయులు ఇంటింటికి తిరిగి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. తమూతో కలిసి పోరా డేందుకు ప్రజలు 926129 2612 నెంబర్ కు మిస్డ్ కాల్ ఇవ్వాలంటూ ప్రచారం చేశారు. వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అధికారం అడ్డం పెట్టుకొని పొలిటికల్ రియల్ ఎస్టేట్ చేస్తూ వందల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని ప్రభుత్వానికే అమ్మి తన స్వార్థం కోసం వినుకొండలోని ఐదు వేల మంది పేదలకు తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. జడ్పిటిసి పారా హైమావతి, జి.విశ్వనాథం, జి.వీరమస్తాన రావు, జి. హనుమంతరావు, ఎస్.కృష్ణ, బి.పేరయ్య, డి.ఏడుకొండలు, మాజీ జెడ్పిటిసి రవి, జి.యోహాను, సిహెచ్.గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'అసమర్థ ప్రభుత్వాన్ని సాగనంపండి'

ప్రజాశక్తి-పెదకూరపాడు

అసమర్థ వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపాలని టిడిపి నాయకులు అన్నారు. మండలంలోని 75 తాళ్లూరు లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గురువారం రాత్రి జరిగింది. గ్రామ టిడిపి అధ్యక్షుడు సిహెచ్ సుబ్బారెడ్డి, కె.సుందరరామిరెడ్డి, ఎన్. అమరారెడ్డి, జి.వెంకటారెడ్డి, వై.శ్రీని వాసరెడ్డి, జె.కోటిరెడ్డి, వి.వేమారెడ్డి తది తరులు పాల్గొన్నారు.

శవ రాజకీయాలకు పుట్టినిల్లు

శవ రాజకీయాలకు వైసిపి ప్రభుత్వం, నాయకులు పుట్టినిల్లు అని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కందుకూరులో జరిగిన ఘటనపై యావత్ రాష్ట్రం దిగ్భ్రాంతికి గురైంది కానీ ఒక వైసిపి మాత్రమే జరిగిన దుర్ఘటనపై దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. చంద్రబాబు పబ్లిసిటి పిచ్చి వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోయారంటూ వైసిపి నేతల వ్యాఖ్యలు చాలా బాధాకరమన్నారు. వైసిపి ప్రభుత్వం సరైన బందోబస్తు నిర్వహించకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. మంత్రులు, వైసిపి ఎమ్మెల్యేలు హాస్యాస్పద వ్యాఖ్యలు మానుకొని ప్రభుత్వపరంగా వారికి చేయల్సిన సాయం ఏదైనా ఉంటే చేయాలని డిమాండ్ చేశారు.

టిడిపి కార్యకర్తలకు నివాళి

ప్రజాశక్తి-నరసరావుపేట

టిడిపి కార్యకర్తల మరణం బాధాకరమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. కందుకూరు ఘటనలో మృతి చెందిన 8 మంది టిడిపి కార్యకర్తలకు స్థానిక టిడిపి కార్యాలయంలో సంతాప నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలను కోల్పోయి బాధ పడుతుంటే వైసిపి నాయకులు శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా మైనారిటీ అధ్యక్షులు అమీర్ ఆలీ, ముస్లిం నాయకులు మన్నన్ షరీఫ్ మీరావలి, మాబు, సైదా పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల రద్దు తగదు

ప్రజాశక్తి-రెంటచింతల

కుంటి సాకులతో సామాజిక పింఛన్లు రద్దు చేస్తామంటూ నోటీసులు ఇవ్వడం దారుణమని తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా రైతు విభాగం కార్యదర్శి చెరెడ్డి కృష్ణా రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పింఛన్లు పోతున్నాయన్న బాధతో వృద్ధులు కన్నీరు పెడుతున్నారని, జీవిత చరమాంకంలో వచ్చే పిం ఛన్‌ను కూడా నిలిపి వేస్తే తాము ఎలా జీవించాలని అంటున్నారని చెప్పారు. టిడిపి మండల ఉపాధ్యక్షులు ఎన్. శ్రీనివాసరావు, బాలయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలు స్వాభిమానం, సాధికారతతో ఎదగాలి

రోటరీ క్లబ్ రీజియన్ చైర్మన్ కె. శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - గుంటూరు

దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న మహిళలు కాలానుగుణంగా ఆత్మవిశ్వాసం, ఆర్థిక ప్రగతి అనే రెండు అంశాలతో సామాజిక ఎదుగుదల ద్వారా దేశం అన్నివిధాల అభివద్ధి చెందుతుందని రోటరీ క్లబ్ జిల్లా రీజియన్ చైర్మన్ కె.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక కాకాని రోడ్డు వాసవి కాంప్లెక్స్ ప్రక్కన సిటీ మార్కెట్ కాంప్లెక్స్ ఆవరణలో ప్రగతి నారీ శక్తి పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీ దానికి అనుబంధంగా ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకాల కేంద్రం వైష్ణవి ఎంటర్ప్రైజెస్ లను కే శ్రీధర్ బాబు, తాడేపల్లి రాజగహ అధినేత రత్న ప్రదీప్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రగతి నారీ శక్తి, వైష్ణవి ఎంటర్ప్రైజెస్ ఫౌండర్ చైర్మన్ పొట్లూరి దేవి మాట్లాడుతూ గత రెండున్నర దశాబ్దాలుగా మహిళ జాగతి కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు వారి కాళ్ళపై వాళ్లు అధికంగా నిలబడే లాగా స్వయం సహాయ గ్రూపుల ద్వారా వత్తి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, నారీ శక్తి గౌరవాధ్యక్షురాలు రాచకొండ రాజకుమారి, ముస్లిం ఐక్యవేదిక జనాబ్ రహమాన్, చైతన్యం శ్రీనివాస్, నేహా టెక్స్టైల్స్ కుసుమ, %u% మల్లిక, పి వైష్ణవి, పి సింధు, వాణి, మునెమ్మ, సమర్థని, జయలక్ష్మి, సౌజన్య, సీత, పూలవతి తదితరులు పాల్గొన్నారు

చౌక ధరల దుకాణాల పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా పరిధిలోని చౌక ధరల దుకాణాలను గుంటూరు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ జి.లక్ష్మి గురువారం పరిశీలించారు. చౌక ధరల దుకాణాలు పక్కా బిల్డింగ్‌లలో అమలు చేస్తున్నారా లేదా, సరుకులకు తగిన స్థలం ఉన్నదా లేదా తదితర వివరాలు పరిశీలించారు. అనంతరం ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన లబ్ధిదారులకు ఉచితముగా పంపిణి చేస్తున్న రేషన్ బియ్యం సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. సకాలంలో నిత్యావసర వస్తువులు అందజేయాలని సూచించారు. సరుకుల నాణ్యత,కాటా వేసే పరికరాలను పరిశీలించారు. వాటిలో ఎటువంటి అవకతవకలు జరగకూడదని ఆదేశించారు. స్టాక్, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా స్టాక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఉపాధ్యాయ బదిలీలపై వినతి

ప్రజాశక్తి - గుంటూరు

ఉపాధ్యాయ బదిలీలను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఎస్టియు గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గేరా మోహనరావు, చందా నరసింహారావు కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖఅధి పి.శైలజకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. బదిలీలకు సంబంధించిన జీవోలోని అసంబద్ధతలను తొలగించి, సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రాధాన్యత క్రమంలోని అర్హులకు న్యాయం చేయాలని, అనర్హులను తొలగించాలన్నారు సబ్జెక్ట్ కన్వర్షన్కు పున్న పరిశీలన నిమిత్తం మరో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పదోన్నతులకు విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు పున్న పరిశీలన నిమిత్తం మరో అవకాశం ఇవ్వాలని కోరారు. బదిలీలకు సంబంధించి ఉపాధ్యాయుల అభ్యంతరాల పరిష్కారానికి జిల్లాస్థాయిలో గ్రీవెన్స్ కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టియు గుంటూరు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి యూ చంద్రజిత్ యాదవ్, గుంటూరు జిల్లా ఆర్థిక కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్ టి యు నాయకులు వి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రజిని ప్రకటించాలి : కెవిపిఎస్

(మొదటి పేజీ తరువాయి)

కాజేశాడని, ఈయన అప్పుడు టిడిపికి, ఇప్పుడు వైసిపికి అనుచరుడుగా ఉంటుండడంతో అతనిపై దళిత మహిళలు చేసిన ఫిర్యాదునూ పోలీసులు స్వీకరించలేదని తెలిపారు. సొసైటి సభ్యులు, వారి వారసులు ఎవరెవరికి ఎంత డబ్బులు ఇచ్చారో జాబితా ఇస్తామని ఇవ్వకుండా తహశీల్దారు, నర్సరావుపేట అర్‌డిఒ తప్పించుకున్నారని, చివరికి సమాచార హక్కు చట్టం కింద కూడా సమాచారం ఇవ్వలేదని తెలిపారు. యడవల్లిలో జగన్న కాలని ఇళ్ల స్థలాల కోసం ఎకరం రూ.26 లక్షలకు కొన్నారని, దళితుల భూములకు మాత్రం రూ.8,33,333 మాత్రమే ఇచ్చారని, ఇది మోసం కాదా? అని ప్రశ్నించారు. అసైన్డు భూముల క్రయ విక్రయాలు చట్ట విరుద్ధమైనా దళితుల భూములను కొనుగోలు చేసిన వారు మురికిపూడిలో భూముల చుట్టూ ఫెన్సింగ్ వేస్తే ఎందుకు చూస్తు ఉన్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించిన దళిత యువకుడిపై అక్రమ కేసు పెట్టించారని మండిపడ్డారు. మురికిపూడి దళితులకు పట్టాలు ఎప్పుడూ ఇవ్వలేదంటూ అప్పటి తహశీల్దార్ చెప్పారని, ప్రస్తుతం మైనింగ్‌కు ఇచ్చిన భూమి ప్రభుత్వ భూమి అని ప్రస్తుత తహశీల్దార్ ప్రకటించడం హాస్యాస్పదమని అన్నారు. దళితుల దగ్గర ఉన్న పట్టాలు, పాస్ పుస్తకాలు ఎవరిచ్చినట్టని నిలదీశారు. మైనింగ్ ముఠాకు సహకరించే పద్ధతుల్లో తహశీల్దార్ మాట్లాడటం చట్ట విరుద్ధమని, ఈ తప్పులన్నింటికీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

పందెం కోడిపుంజుల అపహరణ

- అమరావతి కరకట్టపై ఉన్న కోళ్లఫారంలో ఘటన
- పది కోడి పుంజుల తస్కరణ
- ఒక్కోదాని ధర రూ.30 -40 వేల వరకు
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

ప్రజాశక్తి-తాడేపల్లి

అమరావతి కరకట్ట మీద గల మాజీ సిఎం చంద్రబాబు నివాసానికి దగ్గరలోని ఉండవల్లికి చెందిన గుర్రాల శ్రీనివాసరావు కోళ్ల ఫారం నుంచి పది పందెం కోడి పుంజులను దొంగలు ఎత్తుకుపోయారు. బుధవారం రాత్రి పది గంటల వరకు తాను కోళ్ల ఫారం దగ్గరే ఉన్నానని, అర్ధరాత్రి దుండగులు తస్కరించి ఉండవచ్చని బాధితుడు చెబుతున్నాడు. కోడి పుంజుల భద్రత కోసం వేసిన మెష్‌ను కత్తిరించి దొంగలు లోనికి ప్రవేశించారు. దొంగతనానికి ఉపయోగించిన కటింగ్ ప్లేయర్ అక్కడే వదిలి వెళ్లారు. పది కోడి పుంజులను దొంగలు ఎత్తుకుపోయారని బాధితుడు తెలిపాడు. ఒక్కో కోడి పుంజు ధర రూ.30 నుంచి 40 వేల దరకు ఉంటుందని మొత్తం రూ.4 లక్షల వరకు నష్టపోయానని బాధితుడు చెబుతున్నాడు. బాధితుడు పోలీసులకు సమాచారం అందించాడు. తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బరిలోకి దిగనున్న పందెం కోళ్లు

మరో పది రోజుల్లో సంక్రాంతి పండుగ రాబోతుంది. భోగి నుంచి మూడు రోజుల పాటు సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించనున్నారు. రాష్ట్రంలో సంక్రాంతి పండుగ అంటేనే కోడి పందేల పేరుతో సందడి చేస్తారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వ మంత్రులు, ప్రజాప్రతినిధులు తమ పలుకుబడి ఉపయోగించి కోడి పందేలు వేసే బరుల వైపు వెళ్లకుండా పందేలు నిర్వహిస్తారు. కోట్లాది రూపాయలు చేతులు మారే అవకాశం ఉంది. ఉండవల్లిలో పందెం కోళ్లు దొంగతనం జరగడంపై చర్చనీయాంశమైంది. కృష్ణానది లంకల్లో ప్రతి ఏటా కోడి పందేలు గుట్టుచప్పుడు కాకుండా జరుగుతూనే ఉంటాయి. ఈసారి కూడా పెద్ద ఎత్తున కోడి పందేలు జరపడానికి సన్నాహాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉండవల్లిలో పందెం కోళ్లు దొగంతనం ఘటనతో పాటు పెనుమాకలో కూడా ఎర్రగరుగు ప్రాంతంలో పెద్ద ఎత్తున పందెం కోళ్లను పెంచుతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి వీటిని కొనుగోలు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి కృష్ణానది లంకల్లో కోడి పందేలు జరపడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. చట్టవిరుద్ధంగా సంక్రాంతి సంబరాలు జరుపుకోవడంపై పోలీసులు ముందుగానే హెచ్చరిస్తున్నారు. గత అభవాలను దృష్టిలో పెట్టుకుని పోలీసుల హెచ్చరికలు ఏ మేరకు పనిచేస్తాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికార రాజకీయం ముందు పోలీసులు చివరకు చేతులు ఎత్తేస్తారని విమర్శలు వినిపిస్తున్నాయి. కోడి పందెం సమయంలో వేసే కత్తులు విజయవాడ కేంద్రంగా తయారవుతున్నట్లు తెలిసింది. కోడి కత్తుల విక్రయదారులను పట్టుకునే పనిలో విజయవాడ పోలీసులు ఉన్నట్లు సమాచారం. కోడి పందెంతో పాటు బరుల దగ్గర గుండాట, కార్డ్స్‌ప్లే తదితర జూద క్రీడలను నడిపే అనవాయితి ఈసారి కూడా కొనసాగుతుందా లేదా అనేది తేలాలంటే పది రోజులు వేచి ఉండాల్సిందే. మంగళగిరి నియోజకవర్గ ప్రాంతంలో కోడి పందేలు, ఇతర జూద క్రీడల నిర్వాహకులు సుమారు 100 నుంచి 200 మంది వరకు ఉంటారని పోలీసుల అంచనా. ఈసారి జిపిఎస్ సిస్టమ్ ద్వారా కోడి పందేలను అరికడతామని పోలీసులు చెబుతున్నారు. గ్రామాల్లోని బరులకు ఉపయోగించే స్థలాలను కోడి పందేల నిర్వాహకులకు ఇవ్వవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. హైకోర్టు ఆదేశాలను కూడా ఈసారి అమలు చేస్తామని అంటున్నారు. ఇటువంటి హెచ్చరికలన్నీ గతంలో తాము చూశామంటూ బరుల నిర్వాహకులు వారి పని వారు చేసుకుపోతున్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు

రూ.5 లక్షల బంగారం స్వాధీనం

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని కొండ్రముట్లకు చెందిన మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కుని వెళ్లిన నిందితుడిని గ్రామంలోని జంక్షన్ వద్ద గురువారం అరెస్టు చేసినట్లు వినుకొండ రూరల్ సిఐ ఎస్.రమేష్‌బాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈపూరు మండలం కొండ్రముట్ల గ్రామంలో మాయ మాటలు చెప్పి మహిళ మెడలో దొంగతనం చేసి పారిపోయిన బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కూకట్పల్లి గ్రామానికి చెం దిన షేక్ నాగూర్ బాబును అరెస్ట్ చేసామని తెలిపారు. కొండ్ర ముట్ల జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తుండగా నాగూర్ బాబు అను మానాస్పదంగా వ్యవహరిస్తుండడంతో అదు పులో తీసుకొని విచారించడం జరిగిందన్నారు. షేక్ నాగుర్‌బాబు అలియాస్ నాగూర్‌బాషా పెయిం ట్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. చెడు వ్యసనాలకు బానిసై చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతుంటాడు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో నిందితుడిపై 16 కేసులు ఉన్నాయి. ఈ నెల 18 వ తేదీన కొండ్రముట్లకు చెందిన కొండ్రముట్ల అలివేలమ్మ కొట్టు వద్దకు వెళ్లి, తెలిసిన వ్యక్తిగా పరిచయం చేసుకున్నాడు. మాయ మాటలు చెప్పి బైక్ పై ఎక్కించుకొని సత్యనారా యణపురం గ్రామ శివారులోని పంట పొలాల వద్దకు తీసుకువెళ్లి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని ద్విచక్ర వాహనంపై పారి పోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, సిబ్బంది సహ కారంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పై తెలిపారు. అతని వద్ద నుండి రూ.5 లక్షల విలువ చేసే 96 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. నిందితుడిని పట్టుకొని చోరీ సొత్తు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన పోలీసులను పల్నాడు జిల్లా ఎస్పి వై. రవిశంకర్ రెడ్డి అభినందించారు.

కాల్వలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి-దుగ్గిరాల

కృష్ణ పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ బకింగ్‌హామ్ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహాన్ని తుమ్మపూడి సమీపంలో గురువారం కను గొన్నారు. సుమారు 35 నుండి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన పురుషుడి మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉంది. కాలువలో పడి ఎక్కువ రోజులు అయింది. మృతుడి శరీరంపై ఎరుపు, నలుపు చారల బారు చొక్కా, నీలం రంగు లుంగీ ఉన్నాయి. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఎస్ ఐ ఎ.శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్సు బోల్తా

ప్రజాశక్తి-బెల్లంకొండ:

బెల్లంకొండ మండల పరిధిలోని వన్నాయ పాలెం గ్రామం సమీపంలో గురువారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. నాగిరెడ్డి పాలెంలోని విజడమ్ ప్రైవేట్ స్కూలు పిల్లలను బస్సులో ఎక్కిం చుకునేందుకు చంద్రాజుపాలెం నుండి వన్నాయ పాలెం వెళుతుండగా అదుపు తప్పి బోల్తా కొట్టింది. బస్సులో పిల్లలు ఎవరూ లేకపోవడంతో ప్రమా దం తప్పిందని పొలంలో పనిచేస్తున్న కూలీలు, స్థానికులు తెలిపారు. డ్రైవర్, క్లీనర్ కి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ విషయం తెలుసుకున్న బెల్లం కొండ ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఉచిత శిబిరాల నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి-నరసరావుపేట

ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయమంటూ అంజిరెడ్డి హాస్పిటల్ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అభినందించారు. స్థానిక అంజిరెడ్డి హాస్పిటల్ లో డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్, అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా గుండె వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ లో కార్డియాలజిస్ట్ డాక్టర్ కోట శబరి గిరీష్ ఆధ్వర్యంలో మొదటి 100 క్యాత్ లాబ్ ప్రొసీజర్స్ పూర్తి చేసిన సందర్భంగా ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే ప్రశంసించారు. అంజిరెడ్డి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ఎల్. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో అపోలో హాస్పిటల్స్ వైద్య బృందం, ప్రముఖ కార్డియోతోరాసిక్ సర్జన్ పద్మశ్రీ డాక్టర్ గోపాలకష్ణ గోకులే వైద్య బృందం పాల్గొని వైద్య సేవలందించారన్నారు. గుండెకు సంబంధించిన 250 మంది రోగులను పరీక్షించామని, ఉచితంగా రక్త పరీక్షలు, ఈ.సి.జి, టి.ఎం.టి, శస్త్ర చికిత్సలు అవ సరమైన 120 మందికి ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు వివరించారు. గుండెకు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తా మన్నారు. అంజిరెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాల సేవ లను పల్నాడు జిల్లా, పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

కందుకూరు ఘటన మృతులకు

టిడిపి రూ.25 లక్షలు ఇవ్వాలి

కందుకూరులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో మతి చెందిన 8 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ 25 లక్షలు టిడిపి ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి డిమాండ్ చేశారు.కందుకూరు ఘటనలో 8 మంది మతి చెందడం 25 మందికి గాయాలు కావడం చాలా బాధాకరమన్నారు.చంద్రబాబు నిర్లక్ష్యం వలనే గోదావరి పుష్కరాల సమయంలో కూడా 29 మంది మతి చెందారని గుర్తు చేశారు. అనేక పార్టీల వాళ్ళు అక్కడ అనేక సభలు నిర్వహించారని ఎప్పుడూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకోలేదన్నారు. ప్రస్తుతం టిడిపి చేపట్టిన ఇదేమి ఖర్మ కార్యక్రమంతో మాకేంటి ఈ ఖర్మ అని మతుల కుటుంబాలు వాపోతున్నాయన్నారు.

నాగార్జున కొండను సందర్శించిన పురావస్తు శాఖ డైరెక్టర్

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను భారతీయ పురావస్తుశాఖ న్యూఢిల్లీకి చెందిన మాన్యుమెంట్స్ డైరెక్టర్-2 నవరత్న కుమార్ పాఠక్ గురువారం సందర్శించారు. మ్యూజియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునకొండకు వచ్చే పర్యాటకులకు సౌకర్యాలను మెరుగుపర్చి ఈ ప్రాంత పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. త్వరలో భారత పురావస్తుశాఖ డైరెక్టర్ జనరల్ నాగార్జునకొండ సందర్శించనున్నారని వెల్లడించారు. అనంతరం అనుపులోని పునర్నిర్మిత కట్టడాలను సందర్శించారు. దీనికి ముందు నాగార్జునకొండ అధికారులకు అభివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు. ముందుగా లాంచీ స్టేషన్‌కు చేరుకున్న డైరెక్టర్‌కు స్థానిక ఎంఆర్‌పిఎస్ నాయకులు యు.మార్క్ కొండలోని పలు సమస్యలపై వివరించారు. ఆయన వెంట అమరావతి సర్కిల్ సూపరింటెండెంట్ గోపినాథ్, నాగార్జునకొండ మ్యూజియం క్యూరేటర్ జంపాని కమల్హాసన్, జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ యు.వెంకటయ్య, గార్డెన్ ఫోర్మెన్, విశత్ గౌడ, మ్యూజియం, గార్డెన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒరిజినల్ మార్క్ లిస్టులు పోయినవి

కోవి శ్రీ ప్రియ డాటర్ ఆఫ్ అంజయ్య వైఫ్ ఆఫ్ బండి నాగ పున్నారావు. డోర్ నెంబర్ 2-38 నాగులపాడు గ్రామం పెదనందిపాడు మండలం, గుంటూరు జిల్లా వాస్తవ్యులైన కోవి శ్రీ ప్రియ 24-12-2022 నాడు నాగులపాడు గ్రామం నుంచి పెదనందిపాడు బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్ కు వచ్చుచుండగా మార్గమధ్యంలో టెన్త్, ఇంటర్ ఒరిజినల్ మార్క్ లిస్టులు పోయినవి. వెంటనే ఎంత వెతికినా కనపడలేదు. ఎవరికి అయినా దొరికిన ఎడల 7013853153 నెంబరు కు తెలియపరచవలసిందిగా కోరుచున్నారు.

మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	31,035
మిర్చి ఎగుమతి	:	32,281
మిర్చి నిల్వ	:	9,201

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,500 - 26,000
నెం.5	11,500- 23,500
273	14,000 - 21,500
341	10,500 - 25,000
4884	10,000 - 21,500
సూపర్ 10	18,000 - 23,000
నాన్ ఎసి	
తేజ	9,000 - 23,000
బడిగి	12,500 - 27,000
దేవనూరు డీలక్స్	10,000- 25,000
తాలుకాయలు	4,500 - 13,500
	ఎసి
334	10,000 - 25,000
341	16,000 - 26,000
తేజ	10,000 - 21,500
బడిగి	21,000 - 21,000
తాలుకాయలు	5,000 - 11,500

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి తదితరులు

ప్రముఖుల ఆధ్వర్యంలో ప్రజాశక్తి 2023 కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రజాశక్తి 2023 కేలండర్‌ను గురువారం పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. స్థానిక లింగంగుంట్లలోని డాక్టర్ వైఎస్ఆర్ జిల్లా ఆసుపత్రిలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించగా వైసిపి నాయకులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, ఇతర నాయకులు ఆవిష్కరించారు. టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆవిష్కరించగా నాయకులు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ హాస్పిటల్‌లో హాస్పిటల్ అధినేత డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, సామాన్య జనం పక్షాన ప్రజాశక్తి నిలుస్తుందన్నారు. ప్రజా సమస్యలను నిత్యం వెలుగులోకి తెచ్చి అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తేవడం ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజాశక్తి పత్రికను పార్టీలకతీతంగా అందరూ చదవాలని కోరారు. కార్యక్రమాల్లో ప్రజాశక్తి నరసరావుపేట డివిజన్ ఇంన్‌ఛార్జి జి.ప్రేమ్‌సాగర్, పల్నాడు జిల్లా రిపోర్టర్ టి.చిన్నశ్రీను, నరసరావుపేట, రొంపిచర్ల విలేకర్లు పి.బుజ్జిబాబు, వి.ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గుంటూరు విజయకుమార్ తదితరులు

విద్యార్థులకు ఉచితంగా ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి - రెంటచింతల

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను మండల కేంద్రమైన రెంటచింతలలోని యుటిఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్షులు విజెవి రాజకుమార్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో స్కాలర్‌షిప్ సాధించాలని పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఈ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. దీన్ని విద్యార్థులకు ఉచితంగా అందిస్తామని చెప్పారు. అనంతరం యుటిఎఫ్ యుటిఎఫ్ డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జి.లింగారెడ్డి, నాసరయ్య, వసంత కుమారి, సాగర్‌బాబు, ప్రతాప్, రాజశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

కొత్త వేవ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటాం

- అవసరమైతే ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రులకు ఇక్కడి నుండే ఆక్సిజన్ సరఫరా
- వైద్యులతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సమీక్ష

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రపంచ వ్యాప్తంగా చెప్పుకుంటున్న అక్కడక్కడ వ్యాప్తి చెందుతున్న కరోనా కొత్త వేరియంట్ బిఎఫ్-7 పట్ల ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అదే సమయంలో నిర్లక్ష్యమూ తగదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరిస్తూ తరచూ చేతులు శుభ్రపరచుకుంటూ భౌతిక దూరం పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కరోనా కొత్త వేరియంట్ - అప్రమత్తతపై స్థానిక లింగంగుంట్లలోని డాక్టర్ వైయస్సార్ జిల్లా 200 పడకల వైద్యశాలలో వైద్యబృందంతో గురువారం సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైరస్‌ను ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లనూ సిద్ధం చేసుకున్నామని అన్నారు. గతంలో హాస్పిటల్‌కు ఆక్సిజన్ విశాఖపట్నం నుండి తెప్పించే వాళ్లమని, ప్రస్తుతం రోజుకు 400 సిలిండర్‌ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన రెండు ప్లాంట్‌లు హాస్పిటల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 150 బెడ్‌లకు నేరుగా ఆక్సిజన్ అందజేసే ప్రక్రియ సిద్ధంగా ఉందన్నారు. అవసరమైతే సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ, మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రులకు కూడా తరలించే సామర్థ్యం ఉందని, ఆక్సిజన్ కొరత రాబోదని వివరించారు. అన్ని విభాగాల్లో వైద్య బృందాలున్నాయని, జనరల్, అనస్థీషియా విభాగంలో ఉన్న కొరతనూ గుంటూరు జిజిహెచ్ వైద్య సిబ్బంది అందుబాటులోకి తెస్తున్నామని పేర్కొన్నారు. ఇంకా అవసరమైతే ప్రత్యేక, అత్యవసర వైద్య బృందాన్ని కూడా నియమిస్తామని చెప్పారు. పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయని, పిపిఇ కిట్లు, ఎమ్‌డిసివర్ ఇంజెక్షన్లు, అవసరాన్ని బట్టి ఇండెంట్ పెడతామన్నారు. దీనికి సంబంధించి సంబంధిత శాఖ అధికారులతో ఇప్పటికే మాట్లాడామన్నారు. పరిస్థితులకు వైద్య బృందం సిద్ధంగా ఉండాలని, రోగుల పట్ల అంకిత భావంతో మెలగాలని సూచించారు. బూస్టర్ డోస్ వేయించుకొని ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేసుకోవాలని, పౌష్టికాహారం తినాలని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఆస్పత్రికి అవసరమైన వైద్య బృందాన్ని, పరికరాలను సమకూర్చేందుకు తాను కృషి చేస్తానని అన్నారు.

ఆక్సిజన్ ప్లాంట్ వద్ద వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

ట్యాబ్‌లతో నైపుణ్యాలను పెంచుకోండి

- విద్యార్థులతో మంత్రి విడదల రజిని, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- పలు పాఠశాలల్లో ట్యాబ్‌లు పంపిణీ

నాదెండ్లలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి - నకరికల్లు, నాదెండ్ల

విద్యార్థులు మాతృభాషతోపాటు ఆంగ్లంలోనూ నైపుణ్యం సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ఆకాంక్షించారు. ట్యాబ్‌ల ద్వారా నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌ల పంపిణీలో భాగంగా మండల కేంద్రమైన నాదెండ్ల జెడ్‌పి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొనగా నకరికల్లు మండలం దేచవరం మోడల్ స్కూల్, రాజుపాలెం మండలంలోని అనుపాలెం, కోటనెమలిపురి, నెమలిపురి గ్రామాల్లో ట్యాబ్‌లను విద్యార్థులకు ఎంపీ అందించారు. వివిధ ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల ద్వారా కార్పొరేట్ స్థాయి విద్యను తమ ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. విద్యారంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.మస్తాన్‌రావు, ఎంపిపి టి.రాణి, మాజీ ఎంపిపి కె.వీరారెడ్డి, సొసైటీ చైర్మన్ ఎస్.కోటిరెడ్డి, ఎం.కోటిరెడ్డి, ఎంపిటిసిలు జి.యల్లారావు, కె.అంకమ్మ, డి.ఏసమ్మ, సర్పంచ్ పి.వెంకటేశ్వర్లు, బి.సీతారామిరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ బి.రాంబాబు, నాయకులు కె.రామకృష్ణ, పి.బ్రహ్మయ్య, జి.ఉపేంద్ర, ఎం.ఏడుకొండలు, టి.రత్తయ్య, కె.నాగేశ్వరరావు, ఆర్.చెంచురాజు, కె.శేషయ్య, చిన్నకోటయ్య, అప్పారావు, మస్తాన్‌వలి, జి.సుబ్బారావు పాల్గొన్నారు. ఎంపి శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తమ వైసిపి ప్రభుత్వం తీర్చిదిద్దిందని, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా చదువును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. యూనిఫాం, బూట్లు, ఇతర సదుపాయాలతోపాటు నాడు-నేడు కింద పాఠశాలలను ఆహ్లాదకరంగా చేసి ప్రగతికి బాటలు వేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి గొప్పగా చదువుకొని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని చెప్పారు. పిల్లలకు మనం అందించే విలువైన ఆస్తి చదువేనని, చదువు వల్ల ఒక మనిషితోపాటు ఆ కుటుంబం మొత్తం పరిస్థితులు, సమాజమూ మారతాయని అన్నారు. ఏదైనా గ్రామం అభివృద్ధి చెందిందంటే అందుకు కారణం ఆ ఊరిలో చదువుకున్న వారు ఎక్కువగా ఉండడమేనని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ఆర్థిక ప్రోత్సాహాల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, ఆరోగ్యంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం, దేచవరం సచివాలయాన్ని ఎంపీ సందర్శించారు. రక్షిత మంచినీటి చెరువును పరిశీలించి అమృత మహోత్సవం కింద మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బి.రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వి.రాజారెడ్డి, నకరికల్లు సొసైటీ మాజీ అధ్యక్షులు డి.కోటిరెడ్డి, ఎంపిడిఒ బి.శ్రీనివాస్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వేళంగిని మేరీ, రాజుపాలెం ఎంపిపి టి.రాజేశ్వరి, వైసిపి మండల అధ్యక్షులు వి.శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.సుబ్బారెడ్డి, ఎంఇఒ మల్లికార్జునశర్మ, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రొంపిచర్ల

విద్యారంగంలో సమూల మార్పుకు సిఎం జగన్ శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ట్యాబ్‌ల పంపిణీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, 2 మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 512 మందికి ట్యాబ్‌లు అందించారు. జెడ్‌పిటిసి పి.ఓబుల్‌రెడ్డి, ఎంపిపి జి.బాలనాగమ్మ, ఎంఇఒ కె.పి.బాబురెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పి.రవీంద్రబాబు, మాజీ సర్పంచులు జి.చినకోటిరెడ్డి, పి.చక్రారెడ్డి, వైస్ ఎంపిపి టి.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు జి.వెంకట్రావు, సిహెచ్.సంజీవరెడ్డి, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నూజెండ్ల

మండలంలోని ములకలూరు జెడ్‌పి పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేయగా ముఖ్యఅతిథిగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్ హాజరయ్యారు. హెచ్‌ఎం శ్రీలతదేవి, విద్యకమిటి చైర్మన్ వీరయ్య, పానకాలరెడ్డి, సుదర్శన్‌బాబు, హారిక, రాజుకుమరి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పసుమర్రులోని శ్రీమద్ది కామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 85 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని మాట్లాడుతూ పేద పిల్లలకు నాణ్యమైన విద్యనందించడం సిఎం ధ్యేయమని, పథకాలను సద్వినియోగం చేసుకున్న ఉన్నత స్థాయికి ఎదగాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.సుధారాణి, 15, 16 వార్డుల కౌన్సిలర్లు జె.సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, లక్ష్మీ, వెంకటసుబ్బయ్య, హరిబాబు, నాగవర్ధిని, మౌలాలి పాల్గొన్నారు.

నకరికల్లు మండలం దేచవరంలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

హోం కంపోస్ట్ తయారీపై ప్రజలకు అవగాహన

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో సచివాలయాల వారీగా వ్యర్థాల నుండి క్లస్టర్, హోం కంపోస్ట్ తయారీపై కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రజారోగ్య విభాగ అధికారులతో నగరంలో పారిశుధ్య పనులు, ఇంటింటి చెత్త సేకరణ, సర్వీస్ రిక్వెస్ట్‌లు, ట్రేడ్ లైసెన్స్‌లు, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రొసెసింగ్ కార్యదర్శులతో సచివాలయాల్లో అందే సేవల పెంపుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి వార్డు సచివాలయం పరిధిలో ప్రతి కార్యదర్శి ప్రజలకు హోం కంపోస్ట్ తయారి ప్రాధాన్యత, తయారీ విధానంపై అవగాహన కల్పించాలని, అపార్ట్మెంట్‌లో క్లస్టర్ కంపోస్ట్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద మొత్తంలో వ్యర్థాలు వచ్చే హెూటల్స్, రెస్టారెంట్లు కూడా తప్పనిసరిగా ఆన్‌సైట్ క్లస్టర్ కంపోస్ట్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. 2023 స్వచ్ఛ సర్వేక్షణ్ లో గుంటూరు నగరం మెరుగైన ర్యాంక్ సాధించేలా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని అందులో భాగంగా ఎంహెచ్ఓ నగరంలో రోజువారీ పారిశుధ్య పనులు, కార్మికుల, కార్యదర్శుల, ఎస్.ఐ.ల హాజరు పర్యవేక్షణ చేస్తారని, సిఎంఓహెచ్ స్వచ్ఛ సర్వేక్షణ్ లో ఉత్తమ ర్యాంక్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటారన్నారు. అనంతరం పారిశుధ్య పనులపై సమీక్ష చేస్తూ ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా చూడాలన్నారు. ఎంహెచ్ఓ, ఎస్.ఎస్.లు ప్రతి రోజు వార్డుల్లో ఆకస్మిక తనిఖీలు చేసి, పారిశుధ్య మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని, క్షేత్ర స్థాయిలో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలకు సిఫార్స్ చేయాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

సచివాలయ పరిధిలో పక్కాగా పారిశుధ్య పనులు జరిగేలా, ఇంటింటి చెత్త సేకరణ, ప్రధాన రహదార్ల స్వీపింగ్లకు కార్మికుల కేటాయింపు జరగాలన్నారు. ఎక్కడైనా రోడ్ల మీద చెత్త వేస్తే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని, షాప్స్ వారు వేస్తే సీజ్ చేయాలని అన్నారు. ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రొసెసింగ్ కార్యదర్శులతో మాట్లాడుతూ సచివాలయాల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, కుల ధృవీకరణ పత్రాలు, ఈసీలు, పాన్ కార్డ్, పాస్ పోర్ట్, ఇన్సూరెన్స్ రెన్యువల్ ప్రీమియం, గ్యాస్ బుకింగ్, బస్, ట్రైన్, ఫ్లైట్ టికెట్స్, టెలి హెల్త్ కన్సల్టెన్సీ వంటి సేవలు అందుతాయని స్థానిక ప్రజలకు తెలియ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజ, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, సి.ఎం.ఓ.హెచ్. డాక్టర్ విజయలక్ష్మీ, ఎం.హెచ్.ఓ. డాక్టర్ భాను ప్రకాష్, ఈ.ఈ. కొండారెడ్డి పాల్గొన్నారు.

తాము తయారు చేసిన నమూనాలతో విద్యార్థులు

వివా విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శన

ప్రజాశక్తి-తెనాలి: వివా స్కూల్ నంబూరులో విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శన గురువారం ప్రారంభమైంది. ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రాం (పివైపి) కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల పాఠ్యాంశాలపై ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. దేశ, విదేశాల కరెన్సీ, సైన్స్ , గణితశాస్త్ర నమూనాలు తయాలు ప్రదర్శనలో ఉంచారు. విజ్ఞాన ప్రదర్శనను వివా ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ కుటుంబ వ్యవస్థకు అద్దంపట్టేలా వంశవృక్షం, టౌటానిక్ షిప్, పురాతన వంటపాత్రలను విద్యార్థులు విశేషంగా ప్రదర్శిం చారని, వారిలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రు లతో పాటు డైరెక్టర్ ఎల్‌టి కమాండర్ కెఎస్ రావు, ప్రిన్సిపాల్ సిహెచ్ సరళ, ఐబి సమన్వయకర్త కె.మాధవి పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రపై

మంత్రి నాగార్జున వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి - మంగళగిరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జరిపే పాదయాత్ర పై మంత్రి మెరుగు నాగార్జున చేసిన వ్యాఖ్యలను టిడిపి ఎస్సీ సెల్ నాయకులు గురువారం మంగళగిరి టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఖండించారు. టిడిపి హయాంలో దళితులకు 27 రకాల సంక్షేమ పథకాలు అమలు జరిగాయన్నారు. దళిత ద్రోహి జగన్మోహన్ రెడ్డి వాటిని రద్దు చేయడం జరిగింది అన్నారు. దళితుల సంక్షేమం అని గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి టిడిపి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు రద్దు చేయడాన్ని విమర్శించారు. అలాంటి వారు లోకేష్ పాదయాత్ర పై తప్పుడు వ్యాఖ్యలు సరికాదన్నారు. సమావేశంలో టిడిపి ఎస్సీ సెల్ నాయకులు వి మైనర్ బాబు, వై భాగ్య రావు, ఎం వెంకట్రావు, డి.జ్యోతిబసు, దిట్ల సత్యానందం, ఎం వీరయ్య పాల్గొన్నారు.

ఆర్‌విఆర్‌లో డేటా సైన్స్‌వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు

నిపుణులతో అవగాహన సదస్సుల ద్వారా విద్యార్థులకు అందించే సూచనలు, వారిలోని మేధాశక్తి మెరుగుదలకు, నూతన సాంకేతిక ఆలోచనలకు దోహదపడతాయని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు డేటా సైన్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో బెంగుళూరు ఎరిక్సన్ కంపెనీ, డేటా సైన్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఉప్పాల పాల్గొని, డేటా సైన్స్ కోర్సు ప్రాముఖ్యతను, డేటా సైన్స్‌లో విద్యార్థుల పాత్రను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ కాలంలో అన్ని రంగాల్లో ప్రతి మనిషి యాంత్రిక జీవితంపైనే ఆధారపడే పరిస్థితి ఉందని, అందుకు సాంకేతిక పరిజ్ఞానమే దోహదపడుతుందన్నారు. డేటా సైన్స్ విద్యార్థులు అందించే అప్లికేషన్ల ద్వారానే టెక్నాలజీ సంబంధిత యంత్రాల పనితీరు ఉంటుందన్నారు. వైద్య రంగంలో, వాతావరణ సమతులత్య పాటించటంలో డేటా సైన్స్ విద్యార్థుల పాత్ర అధికంగా ఉంటుందన్నారు. విద్యార్థులు నిరంతరం పరిశోధనలతో రూపొందించే యంత్రాలకు, వస్తువులకు,

డాక్టర్ సునీల్ ఉప్పాలను సన్మానిస్తున్న కళాశాల సెక్రెటరి తదితరులు

టెక్నాలజీలో పేటెంట్ హక్కులు పొందే దిశగా వినూత్న ఆవిష్కరణలు చేయాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తనలోని నైపుణ్యాభివృద్ధే అద్భుతాల సృష్టివైపు-ఆలోచనల దృష్టి కేంద్రీకృతమవుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎంవిపి చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జిఎంసిలో మినీ కాన్ఫరెన్స్ హాల్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో, ఇంజినీరింగ్ విభాగం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్, మినీ కాన్ఫరెన్స్ హాల్‌ను నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు నగర కమీషనర్ కీర్తి చేకూరి, డిప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్.సజీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పాలక సంస్థలో వివిధ విభాగాల సమీక్షలు, ప్రభుత్వ, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ల నిర్వహణ కోసం నూతన హాల్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అలాగే కౌన్సిల్ హాల్‌ను కూడా ఆధునిక వసతులతో, అందరికి సరిపోయేలా అభివృద్ధి చేస్తున్నామని, త్వరలో పూర్తి చేసి, ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, యస్.ఈ భాస్కరరావు, ఇంజినీరింగ్ అధికారులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ శివనాగేశ్వరరావు కన్నుమూత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని ఇప్పటం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జెముడు గాని శివ నాగేశ్వరరావు (65) గురువారం ఉదయం అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. 2005 నుండి 2009 వరకు శివ నాగేశ్వరరావు ఇప్పటం గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఆయనకు భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శివ నాగేశ్వరావు మృతి వార్త తెలుసుకున్న పలువురు పార్టీ నాయకులు శివ నాగేశ్వరావు భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కొలను కొండ గ్రామ సిపిఎం సీనియర్ నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, వైఎస్ఆర్సిపి గ్రామ నాయకులు మున్నంగి వివేకానంద రెడ్డి, లచ్చి వెంకటేశ్వర్లు, తెలుగుదేశం గ్రామ నాయకులు జెముడు గాని రత్తయ్య, శంకర్ శెట్టి పిచ్చయ్య, తదితరులున్నారు.

పేదల గొంతుక ప్రజాశక్తి

ప్రజాశక్తి 2023 క్యాలెండర్, డైరీ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, కుమార్‌పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-గుంటూరు : ప్రజాశక్తి 2023 క్యాలెండర్‌ను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆవిష్కరించారు. గురువారం స్థానిక బ్రాడీపేటలోని సంస్థ జిల్లా కార్యాలయంలో ప్రజాశక్తి జిల్లా కన్వీనర్ బి.సుధాకిరణ్ అధ్యక్షతన ముందస్తు నూతన సంవత్సర వేడుకలు, ప్రజాశక్తి క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల కోసం నినాదాన్ని సాకారం చేస్తూ, నిరంతరం ప్రజల కోసం వార్తా రచన కొనసాగించాలని ఆకాంక్షించారు. సమాజంలో కష్టజీవుల సమస్యలపై పనిచేస్తున్న వార్తాపత్రిక ప్రజాశక్తి అన్నారు. ఎన్ని అననుకూల పరిస్థితులు ఉన్నా తట్టుకొని సంస్థను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్న సిబ్బందికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. సిపియం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు మరింత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజాశక్తి వంటి కార్మిక దృక్పదం కలిగిన పత్రికల ప్రాధాన్యత అధికమైందన్నారు. ప్రజల నిజమైన సమస్యలు నిత్యం వెలుగులోకి తీసుకురావాలని అన్నారు. ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ జి.శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రజాశక్తి సిబ్బందికి, పాఠకులకు ముందస్తు నూతన సంవత్సర శుభాకాక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి సిహెచ్.శంకర్, సిటీ ఇన్‌ఛార్జి కె.సుధీర్, స్టాఫ్ రిపోర్టర్ శర్మ, రాజముని, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి: సామాజిక దృక్పదానికి అద్దంపడుతూ నిత్యం ప్రజా సమస్యలపై గళం వినిపించే ప్రజాశక్తికి తరగని ఆదరణ ఉందని ప్రముఖ పారిశ్రామిక వేత్త,

గుంటూరు జిల్లా కార్యాలయంలో ప్రజాశక్తి గుంటూరు జిల్లా క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, పాశం రామారావు, జి.శివరామకృష్ణ తదితరులు

కుమార్ పంప్స్ మేనేజింగ్ డైరెక్టర్ కొత్త సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రజాశక్తి తెలుగు దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సరం 2023 క్యాలెండర్‌ను గురువారం తన నివాసంలో ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఐకాన్‌గా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మంచి ఆలోచనగా చెప్పారు. గత 42 సంవత్సరాలుగా ప్రజాశక్తితో తనకు మంచి అనుబంధం ఉందన్నారు. పేదల సమస్యల పరిష్కారానికి ప్రజాశక్తి ఓ పట్టుగొమ్మగా చెప్పారు. మార్కెటింగ్ మేనేజర్ కొత్త హరికుమార్ మాట్లాడుతూ పత్రికా రంగంలో ప్రజాశక్తి తనదైన ముద్రవేసుకుందని కొనియాడారు. కార్యక్రమంలో

తెనాలిలో ఆవిష్కరిస్తున్న కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం తదితరులు

తెనాలి డివిజన్ ఇన్‌ఛార్జి జి.ప్రభాకరరావు, ఎం.రవికుమార్, ఎ.శ్యామ్‌సాగర్ పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు పేదలకు ఉరితాడు లాంటిది

సిపిఎం మండల కార్యదర్శి బి. సూరిబాబు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం పేదలకు ఇస్తున్న పెన్షన్లను రద్దు చేయటం ఉరితాడు లాంటిదని. సిపిఎం పార్టీ కార్యదర్శి బి. సూరిబాబు అన్నారు. మండల కేంద్రమైన అమరావతిలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో గురువారం సూరిబాబు విలేకరులతో మాట్లాడుతూ వద్దులు, వితంతువులు, వికలాంగులు, వివిధ రకాల పెన్షన్ లు పొందుతున్న వారి పెన్షన్లు తొలగింపు అన్యాయమని అన్నారు. 75 రూపాయలు నుంచి 2750 వరకు పెన్షన్ తీసుకుంటున్న వృద్ధులు దానిపైనే ఆధారపడుతున్న అనేకమంది రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్ పేరుతో కొన్ని పెన్షన్లు రద్దు చేయడం దుర్మార్గమని సూరిబాబు అన్నారు. విద్యుత్ బిల్లు పేరు మీద, వాహన పేరు మీద, వివిధ రకాల పేర్లు తో ఇప్పటివరకు ఇస్తున్న పెన్షన్ దారులని నిరాశకు గురి చేస్తున్నారని అన్నారు. ఓపక్క మాది పేదల ప్రభుత్వం, బలహీన వర్గాల ప్రభుత్వం అని చెప్పుకుంటున్న జగన్మోహన్ రెడ్డి కొత్త పెన్షన్ లు ఇస్తూ పాత పెన్షన్లు రద్దు చేయటం ఎంతవరకు న్యాయమన్నారు.వైసిపి ప్రభుత్వం అమరావతి మండలం లో 209 మంది పెన్షన్ దారులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేశారని అన్నారు.సమావేశంలో గుంటుపల్లి కోటేశ్వరావు సయ్యద్ మోదిని వలి ఉన్నారు.

దుర్గిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై దృష్టి

ప్రజాశక్తి-దుర్గి

మండల కేంద్రమైన దుర్గిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు సబ్ ఇన్స్పెక్టర్ తురక వెంకటరమణ దృష్టి సారించారు. దుర్గిలోని ముటుకూరు రోడ్డు సెంటర్ నుంచి సినిమాహాల్ సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లతో పాటు, తోపుడుబండ్లు, కూరగాయబండ్లను, బడ్డీ బంకులను, వెనుకకు జరపాలని ఆదేశించారు. అనంతరం గ్రామ పెద్దలతో కలిసి రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ వేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వాటిని త్వరలోనే తొలగించనున్నట్లు చెప్పారు. దుర్గి మార్కెట్ యార్డ్ చైర్మన్ వి.ఉమ గోపాల్, సర్పంచ్ సిహెచ్. శాంత రమేష్, ఎంపిటిసి కె.గోపాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

31న భజన కార్యక్రమం

ప్రజాశక్తి - దుర్గి

శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి ఆలయంలో 31వ తేదీన శ్రీ లక్ష్మీ అమ్మవారి మాలాలంకృతదారుల స్వామి భక్తులకు భజనకార్యక్రమం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణా ధికారి శ్రీ గిరిరాజ్ నరసింహబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎస్సై తురకా వెంకటరమణను మర్యాద పూర్వకంగా పోలీస్‌స్టేషన్ లో వారు కలిశారు. ఆరోజు రాత్రి జాతర మహోత్సవం, భజన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాచర్ల ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైసిపి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. శ్రీ లక్ష్మీ అమ్మ వారి సన్నిధికి వచ్చే భక్తులకు,శ్రీ లక్ష్మీ అమ్మవారి మాలాలంకృతదారుల స్వాములకు ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పూర్తి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఈఓ కోరారు.

అందరికీ నాణ్యమైన విద్య కోసం ఎస్ఎఫ్ఐ కృషి

- **యాపిల్ ఐఐటి స్కూల్ చైర్మన్ వేముల వెంకటేశ్వర్లు**
- **52వ ఆవిర్భావ దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ**

ప్రజాశక్తి - మాచర్ల

అందరికీ నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పని చేస్తోందని యాపిల్ ఐఐటి స్కూల్ చైర్మన్ వేముల వెంకటేశ్వర్లు అన్నారు. ఎస్ఎఫ్ఐ 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోస్టర్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి వెంకటేశ్వర్లు గురువారం ఆవిష్కరించారు. యాపిల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయని, వాటిని గమనించి నాణ్యమైన విద్య అందరికీ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలతోపాటు ప్రజలపైనా ఉంటుందని అన్నారు. ప్రతి పేద పిల్ల, పిల్లవాడూ చదువుకోవాల్సిన అసవరం ఉందని, విద్య ద్వారానే సమాజం అభ్యున్నతి సాధిస్తుందని చెప్పారు. అతి పెద్ద విద్యార్థి సంఘమైన ఎస్ ఎఫ్ఐ విద్యావ్యతిరేక విధానాలపై స్థానిక స్థాయి నుండి జాతీయ స్థాయి వరకూ పోరాడుతోందని చెప్పారు. పోటీ ప్రపంచంలో అందరికీ చదువు కోసం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థి దశ నుండి రాజకీయ, సామాజిక, విద్యా రంగ సమస్యల పట్ల అవగాహన పెంచుకుంటూ భవిష్యత్ తరాలకు నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్. రాజు, సాయి, చైతన్య పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగాన నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యాపిల్ ఐఐటి స్కూల్ చైర్మన్ వేముల వెంకటేశ్వరు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-నూజెండ్ల

మండలంలోని నూజెండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు ఇరవై నాలుగు గంటలుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ వెంకట్రావును మీడియా ప్రశ్నించగా వినుకొండ నుండి నూజెండ్ల వచ్చే 33 కెవి లైన్ స్తంభం చెరువు మధ్యలో పడిపోవడంతో తొందరగా పని చేసేందుకు వీలు లేకుండా పోయిందని అన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది తక్షణమే స్పందించి ఆ స్తంభాన్ని నిలబెట్టేందుకు కృషి చేస్తున్నారని, తొందరగానే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.

చెరువులో పడిన విద్యుత్ స్తంభాన్ని పడవ మీద వెళ్లి పరిశీలిస్తున్న విద్యుత్ శాఖాధికారి వెంకట్రావు

పటిష్టమైన ప్రజా వ్యవస్థ కోసమే కన్వీనర్లు

సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ప్రజా సంక్షేమం గడప గడపకు అందించాలనే ప్రభుత్వ ధృడ సంకల్పంతో సచివాలయ కన్వీనర్లను ఏర్పాటు చేశామని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గురువారం స్థానిక సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ అధ్యక్షత వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు అటు ప్రభుత్వానికి ఇటు వాలంటీర్లకు మరొక వైపు సచివాలయ వ్యవస్థకు వారథుల్లా విధులు నిర్వహిస్తారని, అర్హులైన ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత వాలంటరీ వ్యవస్థపై ఉందన్నారు. నూతన ఏడాది నుండి పెంచిన పింఛన్ రూ.2,750ను పింఛన్‌దారులకు అందించేందుకు నాయకులు, కన్వీనర్లు సిద్ధంగా ఉండాలన్నారు. అదేవిధంగా రానున్న సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించకుని నిర్వహించనున్న వైఎస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీల విజయవంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.రాజనారా యణ, సిహెచ్ విజయభాస్కర్‌రెడ్డి, సిహెచ్ సాంబశివరావు, షేక్ నాగులు మీరాన్, కోటే శ్వరరావు నాయక్, కె.దేవ దాస్, పి.బాబు రావు, ఎ.హనుమంతరావు పాల్గొన్నారు.

సమావేశంలోమాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సంక్షేమ పథకాల అమలు బాధ్యత వాలంటీర్లదే

ప్రజాశక్తి-రొంపిచర్ల

ప్రభుత్వ ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత గ్రామ వాలంటీర్లదేనని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో మండలంలోని గ్రామ వాలంటీర్లకు, గ్రామసచి వాలయ కన్వీనర్లకు గురువారం సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామవాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలన్నారు. వాలంటీర్లు తమకు కేటాయించిన ఇళ్ళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. గ్రామాలలో అర్హులైన పేదలకు, లబ్ధిదారులకు సంక్షేమ పథకాల అమలుకు గాను గ్రామ సచివాలయాలకు కన్వీ నర్లను నియమించామన్నారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, సచివాలయాల కన్వీనర్లు ప్రజలకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు నిత్యం అందుబాటులో ఉండాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేందుకు సమిష్టిగా పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట నియోజకవర్గ వైసిపి పరి శీలకులు ఎ.ఆంజనేయులు, జడ్పిటిసి పి.ఓబుల్‌రెడ్డి, ఎంపిపి జి.బాలనాగమ్మ, మార్కెట్ యార్డు ఛైర్మన్ పి.రవీంద్ర బాబు, తహ శీల్దార్ జె.శ్రీనివాసరావు, ఎండిఓ కె.మ్యాథ్యూబాబు, వైస్ ఎంపిపి టి.శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు జి.చిన కోటిరెడ్డి, పి.చక్రారెడ్డి, వైసిపి నాయకులు జి. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

తూబాడులో గడపగడపకు లో పాల్గొన్న మంత్రి రజిని

'ఇచ్చిన హామీలను నెరవేర్చిన ప్రభుత్వం'

ప్రజాశక్తి-నాదెండ్ల

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తూబాడులో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజిని గురువారం సాయంత్రం పాల్గొన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే అది తమ ప్రభుత్వమేనని అన్నారు. అర్హులందరూ ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి టి.రాణి, గ్రామ వైసిపి నాయకులు ఎం.కోటిరెడ్డి, టి.రత్తయ్య పాల్గొన్నారు.

మాది పేదల ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- నరసరావుపేట

పేదల పక్షపాతి ప్రభుత్వం వైసిపి అని ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పేదల పక్షపాతి ప్రభుత్వం వైసిపి అని ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 108వ రోజైన గురువారం మండలంలోని పాలపాడులో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఎంపిటిసి మెట్టు రామిరెడ్డి, సర్పంచ్ చైకం సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ వైసిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి తెలుసుకొని పథకాల అమలులో నెలకొన్న సమస్యలు స్థానికంగా నెలకొన్న సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు తమ వంతు కృషి చేసి ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో విశ్వాసం పెంపొంది ఎలా చేయాలన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ వైసిపి నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

ప్రజాశక్తి - మేడికొండూరు

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని గుంటూరు జిల్లా వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. విసదల ఎన్నారై ఇంజనీరింగ్ కాలేజ్ లో రెండ రోజులుగా భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర గుంటూరు, పారుపల్లి యూత్ అద్వర్యంలో నిర్వహిస్తున్న క్లస్టర్ స్థాయి వాలీబాల్, కబడ్డీ మరియు ఇతర అంశాలలో పోటీలు గురువారం ముగిసాయి. ఈ పోటీలను ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, కత్తెర సురేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డొక్కా మాట్లాడుతు యువతకు చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమని పేర్కొన్నారు. విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించినట్లయితే శారీరికంగా మానసికంగా ఏ సమస్యనైనా ఎదుర్కొనే శక్తి కలుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సాధారణమని, ఓటమి-గెలుపునకు నాంది అని తెలిపారు. ఓటమిని చూసి నిరాశ పడకుండా, గెలుపు వైపు అడుగులు వేయాలని సూచించారు. కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు జాతీయ యువజన సర్వీసుల శాఖ, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ కృషి ప్రశంసనీయం అని, దేశంలో చాలామంది ప్రతి ప్రముఖ క్రీడాకారులు గ్రామస్థాయి మూలలనుంచే ఎదిగారని అన్నారు. వాలీబాల్, కబాడీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీలలో విజేతలకు ప్రశంసా పత్రాలు మరియు మెడల్స్ ఎంపీపీ స్వప్న, కమలా కేర్ హాస్పిటల్ కోఆర్డినేటర్ పారుపల్లి రమేష్ ,జడ్పిటిసి కందుల సిద్దయ్య, ఎన్నారై ఆర్ ఐ కాలేజీ ప్రిన్సిపల్ కోట శ్రీనివాసరావు తదితరులు అందజేశారు.

ఎర్రబాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న కార్మికులు

కార్మికులకు ఎర్రబాలెంలో మద్దతు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాజధాని పారిశుధ్య కార్మికులను పని నుండి తొలగిస్తే మా గ్రామాలలో చెత్తాచెదారం పేరుకుపోతుందని అందుకు మేము అంగీకరించమని కార్మికులకు అండగా నిలుస్తామని ఎర్రబాలెం గ్రామంలోని కార్మిక వాడల్లో నివసిస్తున్న ప్రజలు తెలిపారు. గురువారం సాయంత్రం రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు కార్మిక వాడల్లో ర్యాలీగా ఇంటింటికి వెళ్లి తమ కు జనవరి నుండి పని ఉండదని చెబుతున్న నేపథ్యంలో ఆందోళన పడుతున్నామని తమ కుటుంబాలు రోడ్ల పాలు అవుతాయని, తమ పని నిలుపుకునేందుకు జరిగే ఆందోళనలకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం రవి ఎర్రబాలెం గ్రామ అధ్యక్ష కార్యదర్శులు టి ఆదిలక్ష్మి ఓ రామారావు సంఘం నాయకులు కోటేశ్వరి శ్రీను నాగేశ్వరరావు దివ్య మేరీ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు మద్దతివ్వండి

ఐనవోలులో ఇంటింటి ప్రచారం

మాట్లాడుతున్న లక్ష్మణరావు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధానిలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పారిశుధ్య కార్మికులకు మద్దతుగా నిలవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ కోరారు. బుధవారం రాత్రి రాజధానిలోని ఐనవోలు గ్రామంలో సిఐటియు, రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. అనంతరం కార్మికుల నుద్దేశించి నేతాజీ మాట్లాడారు. తెల్లవారగానే ఇళ్ళ వద్దకు వచ్చి చెత్తా చెదారాన్ని బళ్ళల్లో తీసుకుని వెళ్ళడం, రోడ్లు, వీధులు, ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు అనే భేదం లేకుండా మొత్తం గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. చైతన్యంతో పోరాడి ఐదు నెలల పెండింగ్ వేతనాలు సాధించుకున్నారని, అదే చైతన్యంతో పారిశుధ్య విధుల్లో కొనసాగేలా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మికులకు సిఐటియు అండగా నిలుస్తుందని చెప్పారు. రాజధాని పారిశుధ్య కార్మికులతో పాటు ఇతర కార్మికులకు కూడా పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య విధుల నుంచి కార్మికులను తొలగిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడడం, గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులు స్పందించి రాజధాని పారిశుధ్య కార్మికులను జనవరి నుండి పని కొనసాగిస్తామంటూ ప్రకటన చేయాలన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి లక్ష్మణరావు మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతో పాటు అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టులో పనిచేస్తున్న కార్మికులను ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ లోకి తీసుకొని పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంటింటి ప్రచారంలో రాజధాని డివిజన్ అధ్యక్ష,కార్యదర్శి ఎం రవి,ఎం భాగ్యరాజు పాల్గొన్నారు.

మెటీరియల్ అందచేస్తున్న మస్తాన్‌వలి, ఖాసిం తదితరులు

ఉర్దూ పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్

ప్రజాశక్తి-గుంటూరు

ఉర్దూ భాష అభివద్ధికి, మైనార్టీ విద్యార్థుల అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కషి చేస్తుందని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ రాష్ట్ర డైరెక్టర్ ఎండి మస్తాన్ వలి అన్నారు. స్థానిక చౌత్ర సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సీ.ఈ.డి.యం (సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్ మెంట్ ఆఫ్ మైనారిటీస్) ఆధ్వర్యంలో ఉర్దూ మాధ్యమంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల విద్యకు ఎంతో కషి చేస్తుందని, కాబట్టి విద్యార్థులు అందరూ కష్టపడి చదువుకొని అభివద్ధి బాటలో పయనించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎంతో నైపుణ్యం గల, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించి ఈ స్టడీ మెటీరియల్ రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఉర్దూ మాధ్యమ పాఠశాలకు ఈ మెటీరియల్ పంపించడం జరుగుతుందన్నారు. పదో తరగతి విద్యార్థులు అందరూ ఈ మెటీరియల్‌ను ఉపయోగించుకొని అత్యధిక మార్కులు పొందే విధంగా కషి చేయాలన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న ఉర్దూ డి.ఐ ఎం.డి ఖాసిం మాట్లాడుతూ సకాలంలో ఈ మెటీరియల్ రూపొందించడానికి కషిచేసిన సీఈడీఎం డైరెక్టర్ డాక్టర్ మస్తాన్ వలి తదితరులకు కతజ్ఞతలు తెలియజేశారు.దీని తర్వాత ఏర్పాటు చేయనున్న ప్రత్యేక శిక్షణా తరగతులకు కూడా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి ఉపాధ్యాయులు ఆరిఫ్, రఫీయా మొహమ్మదీ తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో ట్యాబుల పంపిణీలో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

చేబ్రోలులో ట్యాబుల పంపిణీలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

విద్యా వ్యవస్థలో సాంకేతిక విప్లవం ట్యాబుల పంపిణీ

ప్రజాశక్తి - ఫిరంగిపురం :పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడానికి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ట్యాబ్‌లు పంపిణీ చేసి నూతన శకానికి శ్రీకారం చుట్టారని తాడికొండ ఎమ్మెల్యే వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. ఫిరంగిపురం గ్రామంలోని సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాడికొండ ఎమ్మెల్యే, వైఎస్ఆర్ సీపీ అధికార ప్రతినిధి డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవం తీసుకురావడానికి బైజూస్ తో ఒప్పందం చేసుకొని ప్రీలోడెడ్ కంటెంట్ తో విద్యార్థులకు అన్ని విధాలుగా ఉపయోగపడే విధంగా ట్యాబ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. పేదరికాన్ని రూపుమాపాలంటే విద్యతోనే సాధ్యమవుతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. జగనన్న సీఎం అయ్యాక ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖల్ని మార్చడం, విద్యకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చే సీఎంగా నిలిచారని కొనియాడారు. విద్యార్థులు బాగా చదువుకొని, ఉన్నత ఉద్యోగాలు సాధించాలని కోరారు.

విద్యార్థులకు ఉచితంగా ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి - చేబ్రోలు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,వేజండ్లలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎనిమిదవ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ తో కూడిన ట్యాబులను, వేజండ్ల పాఠశాల నుంచి ఎన్.ఎం.ఎస్ పరీక్షకు హాజరవుతున్న 30 మంది విద్యార్థులకు మెటీరియల్‌ను ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ డి అనురాధ, మండల పరిషత్ అధ్యక్షులు కె.సాహితీ కిరణ్ ఆవిష్కరించి,పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతు ఎన్ఎంఎంఎస్ లో విద్యార్థులకు సంవత్స రానికి రూ.12,000 చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. ఇది విద్యార్థుల చదువుకు ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులును ఎగ్జామ్ కి హాజరయ్యాలా ప్రోత్సహించాలని, ఎంపికయ్యేలా విద్యార్థులకు ఉపాధ్యాయులు మంచిగా శిక్షణ ఇవ్వాలని కోరారు. మొత్తం పదివేల పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. మండలంలో ఎన్ యంయంఎస్ కు హాజరవుతున్న 100 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుం దని తెలిపారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బి. అనురాధ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థుల చదువు కొరకు ఎన్నో మంచి పథకాలను రూపొందించారని అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు సాహితి కిరణ్ , డిసిసిబి సభ్యులు పాములు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాసు అనిత ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలసిన మైనార్టీ కమిషన్

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిభూషణ్ చందన్‌ను ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహమ్మద్ ఖాన్, వైస్ ఛైర్మన్ డాక్టర్ జాషువా డానియేల్, సభ్యులు షేక్ సైపుల్లా, జితేందర్ సింగ్, సయ్యద్ హిదయతుల్లా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు గవర్నర్‌ను సన్మానించారు.

ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పోలీసులు ప్రజలకు అందు బాటులో ఉండాలని తెనాలి డిఎస్పి స్రవంతి రాయ్ పేర్కొన్నారు. పొన్నూరు పట్టణ పోలీస్ స్టేషన్లో గురు వారం వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో మమేకమై అన్నివేళలా అందుబాటులో ఉండాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థను అలంబించాలని సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్లోని పలు రికార్డులు పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. పట్టణ సిఐ యం.బాబి, ఎస్సై షేక్. హషీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.13 కోట్లతో ఇప్పటంలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధి ఇప్పటంలో రూ.13కోట్లతో అభివృద్ధిపనులు చేశామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఇప్పటం గ్రామంలో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కళ్యాణ మండపాన్ని సుమారు రూ. 80 లక్షల వ్యయంతో పూర్తి హంగులతో తీర్చిదిద్ది, ఇప్పటం పరిసర ప్రాంతాలైన వడ్డేశ్వరం, గుండి మెడ, కొలను కొండ ప్రాంతాలకు చెందిన పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లల్లో జరిగే శుభకార్యాలను పూర్తిస్థాయిలో, అతి తక్కువ ఖర్చుతో నిర్వహించుకునే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. కళ్యాణ మండపం తో పాటు, వంగవీటి మోహనరంగా, గౌతు లచ్చన్న, చాకలి ఐలమ్మ పేర్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న ఆవరణలోని భవనాలను కూడా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటంలోని జగనన్న కాలనీలో నూటికి నూరు శాతం ఇల్లు నిర్మాణం పూర్తి అయ్యాయని, ప్రస్తుతం గ్రావెల్ రోడ్లు, సిమెంట్ రోడ్లు, సిమెంటు డ్రైనేజీల నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని త్వరలోనే పనులు ప్రారంభించి, అందుబాటులో తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ శారదా దేవి, డి ఈ కష్ణారెడ్డి, వైఎస్ఆర్సిపి తాడేపల్లి మండల యువజన విభాగం అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి, లచ్చి తులసీదాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడు ఆలీబాబాకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఎన్టీఆర్ నటించిన చిట్టిచెల్లెలు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. కళాకారుల సత్కారాల పండుగలో భాగంగా పట్టణానికి చెందిన రంగస్థల కళాకారుడు షేక్ అలీబాబాను ఉత్సవ కమిటీ బృందం సత్కరించింది. కార్యక్రమంలో అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, షేక్ ముజీబ్, బొంతా సురేష్, తాడిశెట్టి గోపి, షేక్ నాగూర్, పెమ్మసాని పోతురాజు, ఎం.రాఘవరావు డి.భవాని, డి భాస్కర్ పాల్గొన్నారు.

వెంటాడిన సాగు కష్టాలు

తెనాలి మండలంలో నీటమునిగిన వరి ఓదెలు చూపుతున్న రైతు (ఫైల్‌ఫొటో)

రైతులకు అడుగడుగునా తప్పని నష్టాలు

పెరిగిన పెట్టుబడులు - తగ్గిన దిగుబడులు

వ్యవసాయ రంగం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 2022 సంవత్సరంలో రైతులకు ఏమాత్రం కలిసి రాలేదు. గత ఏడాది ఎదురయిన చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ఖరీఫ్‌లో పల్నాడు జిల్లాలో లక్షన్నర ఎకరాలు, గుంటూరు జిల్లాలో 50 వేల ఎకరాల్లో ఏ పంటలు వేయకుండా ఖాళీగా ఉంచారు. ప్రకృతి వైపరిత్యాలు రైతులను తీవ్రంగా ఇబ్బందిపెట్టాయి. ప్రభుత్వ సాయం కొంత మందికే దక్కింది. రైతు భరోసా కేంద్రాల్లో రైతుల వివరాలు నమోదుకు మాత్రమే సిబ్బంది పరిమితం అవుతున్నారు.

విత్తనం నాటినప్పటి నుంచి ఉత్పత్తులు విక్రయించే వరకు భరోసా కల్పిస్తామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. అయితే సాగు దారులకు ప్రభుత్వం రూ.13,500 రైతు భరోసాగా అందిస్తున్న సొమ్ముతో కొంత వరకు ఉపశమనం కల్గుతోంది. వరిసాగు చేసిన రైతులకు ఆరుగాలం శ్రమించినా చివరికి మిగిలేది ఎండుగడ్డి తప్ప ఎటువంటి లాభాలు రాలేదంటే అతిశయోక్తి కాదు. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో 2.25 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టినా బస్తా రూ.1100కి మించి కొనేనాథుడు లేరు. కనీస మద్ధతు ధర రూ.2060గా నిర్ధారించినా అతి కొద్ది మందికే మద్ధతుధర లభిస్తోంది. నాలుగు నెలలపాటు కుప్ప వేసి ఆరబెట్టుకుని వస్తే బస్తా రూ.1400కి కొనే పరిస్థితి ఉంటోంది. సగటు దిగుబడి 26 నుంచి 30 బస్తాలుగా ఉన్న పరిస్థితుల్లో రైతులకు పెట్టుబడి వ్యయం కూడా రాని పరిస్థితి. గత జనవరి నుంచి డిసెంబరు వరకు ఎదురయిన పరిణామాలు నిరూపిస్తున్నాయి. క్రమంగా వరి సాగు తగ్గిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పత్తికి మార్కెట్‌లో ఉన్న ధరలు ఆశాజనంగా ఉన్నా ఒకవైపు అధిక వర్షాలు, మరో వైపు తెగుళ్లు వెంటాడి రైతులను దెబ్బతీశాయి. కనీస మద్ధతు ధర క్వింటాలుకు రూ.6380 కాగా మార్కెట్‌లో రూ.8 వేలకు పైగా ధర పలికినా ఆశించిన దిగుబడి రాక రైతులకు నష్టం జరిగింది.

అధిక వర్షాలతో ఇప్పటికే మొదటి తీత పత్తి 30 శాతం వరకు నాణ్యత దెబ్బతిందని అంచనా వేస్తున్నారు. రెండు జిల్లాల్లో 3.64 లక్షల ఎకరాలల్లో పత్తి సాగు జరిగింది. పైరు ఎదుగుదల ఉన్నా పూత, పిందె, గూడ కన్పించడంలేదు. పత్తిపైరుపై రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, పేనుబంక, తెల్లదోమతోపాటు గులాబి పురుగు వల్ల రైతులకు తీవ్ర నష్టం జరిగింది.

తామర తెగులు ప్రభావంతో మిర్చి పైరుకు గత ఏడాది తీవ్ర నష్టం ఏర్పడింది. దీంతో గత ఏడాది కన్నా దాదాపు 50 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గించారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా తామర తెగులు ప్రభావం కొంత కన్పించినా రైతులు ముందస్తుగా అప్రమత్తం కావడం వల్ల నష్టం తక్కువగా ఉంది. ఈఏడాది మేనెలలో వాతావరణ బీమా ద్వారా కొంత మంది రైతులకు రూ.45 కోట్ల వరకు పరిహారం అందింది. ప్రభుత్వ నిబంధనలప్రకారం సాగునీటి సౌకర్యం ఉన్నప్రాంతాల్లో ఎండు మిర్చికి వాతావరణ బీమా పథకం వర్తించదని పలు మండలాల్లో ఒక్క రూపాయికూడాపరిహారం దక్కలేదు. పత్తిపాడు మండలంలో వాతావరణ బీమా అమలు కాకమండలంలో ఒక్క రైతుకు కూడా పరిహారం రాలేదు. కాలువలు,బోర్లు, ఎత్తిపోతలపథకాల కింద సాగు చేసిన రైతులకు వాతావరణ బీమా వర్తించదని అధికారులు చెబుతున్నారు. దీంతో దాదాపు 30 శాతం మంది రైతులకు ఎటువంటి పరిహారం అందలేదు. అలాగే కౌలు రైతులకు కూడా మొండిచేయి చూపారు.

ఈ-క్రాప్ నమోదులో ఇబ్బందులు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులంతా తమ పేర్లను ఈ క్రాప్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ క్రాప్‌లో రైతులు, పంటల వివరాలు నమోదు చేసే బాధ్యతను గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు అప్పగించింది. రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న వారు ఆయా గ్రామాల్లోనే బాధ్యతలు నిర్వహిస్తున్నా రైతులు, కౌలు రైతులను గుర్తించి ఈ క్రాప్ నమోదులో చిత్తశుద్ధితో వ్యవహరించలేదన్న విమర్శలు వచ్చాయి. గుంటూరు, పల్నాడు జిల్లాలో దాదాపు 4.6 లక్షల మంది భూ యజమానులు ఉండగా ఇప్పటి వరకు 3.57 లక్షల మంది రైతులు తమ వివరాలను ఈ క్రాప్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారు. అధికారికంగా గుర్తించిన గణాంకాల ప్రకారం గుంటూరు జిల్లాలో 37,228 మంది కౌలు రైతులను గుర్తించారు. వీరిలో 27,582 మందికి పంట సాగు ధృవీకరణ పత్రం (సిసిఆర్‌సి) అందించారు. పల్నాడు జిల్లాలో పల్నాడు జిల్లాలో 33 వేల మంది ఉన్నట్టు అంచనా వేయగా 29 వేల మందికి సిసిఆర్‌సిలు జారీ చేశారు. కౌలు రైతులకు ఈ క్రాప్‌లో ప్రాధాన్యత దక్కడం లేదు. వారికి ఈకేవైసి, ఇతర సమస్యలు ఎదురయ్యాయి.

ప్రత్తిపాడు మండలంలో తుపానుకు నీటమునిగిన పత్తి పొలం (ఫైల్ ఫొటో)

సేద్యానికి తగ్గిన రుణాలు

వ్యవసాయానికి రుణాలు అందచేయడంలో బ్యాంకులు ఇటీవల కాలంలో నిరాసక్తతను వ్యక్తం చేశాయి. 2022-23 ఖరీఫ్‌లో రుణాలు రైతులకు అరకొరగానే లభించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్వల్పకాలిక రుణాలు,పంట రుణాలు కలిపి మొత్తంగా వ్యవసాయం రంగానికి నిర్ణయించిన లక్ష్యంలో కేవలం 47.59 శాతం మాత్రమే రుణాలు ఇచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 11,095 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా రూ. 5,280 కోట్లు మాత్రమే ఇచ్చారు. వీటిల్లో సగానికిపైగా వడ్డీలు చెల్లించిన వారికి పుస్తక సర్ధుబాటులో కొత్త రుణాలు ఇచ్చినట్టు నమోదు చేశారు. కౌలు రైతులకు కేవలం సిసిఆర్‌సి కార్డులు ఉంటేనే ఇస్తామని చెబుతున్న బ్యాంకర్లు వాస్తవ రైతులకు కూడా రుణాలు ఇవ్వడానికి విముఖత చూపుతున్నారు. వ్యవసాయ రంగానికి ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.8,304.94 కోట్ల మేరకు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా రూ.3,189.69 కోట్ల రుణాలు ఇచ్చారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు, వ్యవసాయ రుణాల కింద రూ.2,791.03 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా రూ.2,090.48 కోట్లురుణాలు ఇచ్చారు.

కౌలురైతులకు మొండిచేయి

గుంటూరు జిల్లాలో కౌలు రైతులకు కేవలం 7630 మందికి రూ.40.85 కోట్లు రుణాలు ఇచ్చారు. వీరిలో 410 మందికి మాత్రమే వ్యక్తిగత వ్యవసాయ రుణాలు రూ.3.39 కోట్లు ఇవ్వగా ఆర్‌ఎంజి గ్రూపులకు సంబంధించి 4351 గ్రూపులకు రూ.17.89 కోట్లు, జెఎల్‌జి 2643 గ్రూపులకు రూ.18.45 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలకు సంబంధించి 226 గ్రూపులకు రూ.1.12 కోట్ల ఇచ్చారు. పల్నాడు జిల్లాలో 39,585 మందికి సిసిఆర్‌సి కార్డులు ఇవ్వగా 3143 మందికి రూ.12 కోట్ల మేరకు రుణాలు అందించారు.

ముగిసిన నెక్స్ట్ జెన్ 'యూత్ ఫెస్ట్'

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డు గోరంట్ల నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న యువజన ఉత్సవాలు మూడోరోజు ముగింపు సందర్భంగా ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన డ్యాన్స్ డ్రామా, జానపద నత్య పోటీలు ఆహ్లాద పరిచాయి. 11వ తరగతి విద్యార్థి ధనుష్ 'ట్రావెలింగ్ విత్ లవ్' మరొక విద్యార్థిని భావన మైత్రి 'షేపింగ్ అవర్ సెల్ఫ్' అంశాలపై చక్కటి ప్రసంగం అతిథులను తల్లిదండ్రులను అబ్బుర పరచింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న టాప్ కిడ్స్ స్కూల్ డైరెక్టర్ లత థామస్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో చదివే విద్యార్థుల్లో వైజ్ఞానిక సాంస్కృతిక అంశాలలో యూత్ ఫెస్టివ్ కార్యక్రమాల ద్వారా మనోవికాసం కలుగుతుందని చెప్పారు. ముఖ్య అతిథితో పాటు డైరెక్టర్లు కోగంటి శ్రీకాంత్ బాబు, డాక్టర్ శ్రీవిద్య, కొలసాని శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సుధీర్ కృష్ణన్ చేతుల మీదుగా జ్ఞాపికలు ప్రశంసా పత్రాలు అందజేశారు.

గుండె జబ్బులకు అధునాతన వైద్యం

మహాత్మగాంధీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - నరసరావుపేట

మాట్లాడుతున్న డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి

గుండెకు సంబంధిత వ్యాధితో బాధపడుతూ అత్యాధునిక వైద్య సేవలు కోసం ఇతర ప్రాంతాలకు వెళుతూ మార్గం మధ్యలో మృతి చెందుతున్న పరిస్థితులను గ్రహించి తమ హాస్పిటల్‌లో గుండె వైద్య విభాగంలో గుంటూరు విజయవాడ హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అధునాతన వైద్య పరికరాలను అందుబాటులో ఉంచామని, అత్యవసర వైద్యం అవసరమైన రోగిని ఒకరిని కాపాడినా తమ లక్ష్యం నెరవేరినట్లేనని మహాత్మా గాంధీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారసాని శ్రీనివాస రెడ్డి తెలిపారు. గురువారం ఆసుపత్రిలో ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.కోటి నిధులతో డిసెంబర్ 27న అత్యాధునిక గుండె వైద్యం పరికరాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దీనిని డాక్టర్ గోపాల కృష్ణ ప్రారంభించారన్నారు.

గుండె వైద్య విభాగంలో తమ హాస్పిటల్‌లో నూతనంగా ఐ.వి.యు.ఎస్ (ఇంట్రా వస్క్యూలర్ అల్ట్రా సౌండ్) మరియు ఎఫ్.ఎఫ్.ఆర్ (ఫ్లాక్షనల్ ఫ్లో రిజర్వ్) అనే నూతన టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. గుండెనొప్పి ఉన్న వారికి యాంజియోగ్రామ్ చేసి బ్లాక్‌లు ఉంటే స్టెంట్ లేదా బైపాస్ చేయాల్సి ఉంటుందని వ్యాధి తీవ్రత మధ్యస్థంగా ఉన్న వారికి అందుబాటులోకి తెచ్చిన నూతన విధానంలో ఎఫ్.ఎఫ్.ఆర్ పరీక్ష నిర్వహించి తప్పనిసరి పరిస్థితుల్లో స్టెంట్ అమర్చడం వలన చాలా మందికి మందులతోనే వ్యాధి తీవ్రత అరికట్టేందుకు అవకాశం ఉందన్నారు. ఐ.యు.ఎస్ గుండె రక్త నాళంలో పూడిక తీవ్రత దాని స్వభావం ఖచ్చితముగా తెలుసుకొని స్టెంట్ చేసిన వారికి సమస్యలు తక్కువగా వస్తాయని దీని ద్వారా వ్యత్యాసం సక్రమంగా తెలుసుకొని తక్కువ వాడడం వలన కిడ్నీ జబ్బులు ఉన్నవారికి కూడా స్టెంట్ అమర్చవచ్చు న్నారు. స్టెంట్ అవసరమైతేనే అత్యంత ఖచ్చితత్వాన్ని ఈ పరికరం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. నూతన అధునాతన వైద్య సేవలు అభివృద్ధి చెందిన దేశాలతో పాటు హైదరాబాద్ మరియు అతి కొద్ది కార్పొరేట్ హాస్పిటల్ లో అందుబాటులో ఉన్నాయని పల్నాడు జిల్లాలో మొట్ట మొదటిగా తమ హాస్పిటల్ లో ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిన వెంటనే గుండె సంబంధిత వ్యాధితో ఉన్న ఇద్దరు పేషంట్లకు అత్యాధునిక పరికరాలు ద్వారా స్టెంట్ లు వేశామని అతి తక్కువ రోజులలోనే కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారని పేర్కొన్నారు. 80 శాతం పైగా ఎడమ వైపు, 90 శాతం పైగా కుడి ప్రధాన రక్త నాళం సన్నబడిన 78 ఏళ్ల వ్యక్తికి మరియు గుండెపోటుకు గురై చికిత్స కోసం వచ్చిన మరో 65 ఏళ్ల వ్యక్తికి ఈ అధునాతన పరికరం ద్వారా చికిత్స అందించినట్లు ప్రస్తుతం వారు పూర్తి ఆరోగ్యంతో ఉన్నట్లు పేర్కొన్నారు. తమ హాస్పటల్ లో అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కారసాని అన్నారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



అధునాతన వైద్య పరికరాన్ని చూపుతున్న డాక్టర్ కారసాని